క్లుప్తంగా

సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం

బూర్గంపాడు: సారపాక సత్యధామంలోని శ్రీ భూ సమేత సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం బుధవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణాన్ని నిర్వహించారు. ద్వార తోరణం, హోమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. రాత్రి వేద పండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణ క్రతువును నిర్వహించారు. పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ జలగం చంద్రశేఖర్ దంపతులతో పాటుగా పలువురు దంపతులు స్వామివారి కల్యాణక్రతువులో కూర్చున్నారు.

అన్నాభిషేకం..

మణుగూరుటౌన్: మండలంలోని గుట్టమల్లారంలోని గాయత్రీదేవి ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉమా రామ లింగేశ్వర స్వామికి ఘనంగా అన్నాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేయగా, ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో 500 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

అశ్వారావుపేటరూరల్: కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి వారి హక్కులను కాపాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ కళాశాలలో 30 మంది కాంట్రాక్ట్ కార్మికులు ఆయన సమక్షంలో సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులను సమైక్య పరిచి వారి సమస్యలపై పోరాటాలు చేస్తామని తెలిపారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా భూపతి శ్రీనివాసరావు, పి.నాగమణి, కోశాధికారిగా ఖరీమాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు సాలార్, రత్నం, సత్యవతి, సలీమా, సీత పాల్గొన్నారు.

మంత్రిని నియమించాలి

భద్రాచలంటౌన్: రాష్ట్రంలో విద్యారంగం అస్థవ్యస్థంగా ఉందని, వెంటనే ప్రభుత్వం విద్యాశాఖకు మంత్రి నియమించి ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి మునిగెల శివప్రశాంత్ కోరారు. పట్టణంలోని మదర్ థెరిస్సా డిగ్రీ కళాశాలలో విద్యారంగ సమస్యలపై బుధవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, పాఠశాల విద్యలో 5, 8 తరగతులకు డిటెన్షన్ విధానం రద్దు చేయాలని అన్నారు. ప్రభుత్వం స్పందించి హాస్టళ్లలో ఫుడ్‌పాయిజన్‌పై విచారణ జరిపించారు, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రూ.18,500 చెల్లించాలి

ములకలపల్లి: ములకలపల్లి జీపీని మేజర్ పంచాయతీగా గుర్తించి, ఇక్కడ విధులు నిర్వహించే పంచాయతీ కార్మికులకు నెలకు రూ.18,500 వేతనం చెల్లించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు సిక్కుల శ్రీనివాసరావు, కార్యదర్శి గంటా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం ములకలపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పారిశుద్ధ్యం, నీటి వసతి తదితర పనుల్లో జీపీ వర్కర్లు అధిక పని ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీల్లో ఇస్తున్న విధంగా గ్రామపంచాయతీ వర్కర్లకు వేతనాలు చెల్లించాలని కోరారు. సమావేశంలో వర్కా రుక్మాంగధరరావు, మేకల రమేశ్, పసుపులేటి వెంకటేశ్వర్లు, కొక్కెరగడ్డ సతీశ్, మారోజు రాజు, బి.వెంకన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులకు ఇంపాక్ట్ వారి ఆధ్వర్యంలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ రీజనల్ కోఆర్డినేటర్ పప్పుల శాంతికుమార్, ట్రైనర్ సునీత, వెంకటేశ్వర్లు విద్యార్థులు మానసిక ధైర్యం, కమ్యూనికేషన్ స్కిల్స్ ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. కోర్సులకు అనుగుణంగా స్కిల్స్, వృత్తి నైపుణ్యతను పెంపొందించుకోవాలని తెలిపారు. ఐటీఐ ప్రిన్సిపల్ బడుగు ప్రభాకర్, టీఓ జి.రవి, ఏటీఓలు కృష్ణారావు, నరసయ్య, గోపాల్ నాయుడు, శ్రీనివాసరావు, పూర్ణచందర్‌రావు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడలపై దృష్టి సారించాలి

గుండాల: మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ యువత విద్య, క్రీడలపై దృష్టి సారించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గుండాల సీఐ రవీందర్ అన్నారు. గుండాల పోలీస్ స్టేషన్ పరిధిలోని అడవి రామవరం గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించి.. యువతకు వాలీబాల్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదివాసీ యువత నక్సలిజానికి, అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని, అభివృద్ధి దిశగా పయనించాలని సూచించారు. గ్రామాల్లోకి ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు తారసపడితే పోలీస్ వారికి సమాచారం అందించాలని అన్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురి అయితే నాటు వైద్యం వాడకుండా, డాక్టర్ల ద్వారా పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలని సూచించారు.

మిగిలింది నష్టాలే..

- రూ.లక్షలు వెచ్చించి మిర్చి సాగు..
- తెగుళ్ల వ్యాప్తితో చేజారుతున్న పంట
- మార్కెట్ ధరల్లో అస్థిరత్వం

మిరప రైతులు ఇటీవల కాలంలో ఎన్నో కష్టాలను అనుభవిస్తున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టినప్పటికీ అనుకోని వాతావరణ మార్పులు, చీడపీడల మూలంగా పంట చేతికి రాకముందే చతికిలపడుతోంది. ఏదోలా నెట్టుకొచ్చి మిగిలిన ఆ కొద్దిపంటను మార్కెట్‌కు తీసుకెళ్లే సమయం వచ్చే సరికి ధరలు పడిపోతున్నాయి. దీంతో మిర్చిరైతులు భారీ నష్టాలను చవిచూస్తున్నారు.



రేగుళ్లలో తెగుళ్లు సోకి ఎదగని మిర్చితోట

కరకగూడెం: గత ఏడాది ధరలు బాగా ఉండటంతో ఈ సారి రైతులు సామర్థ్యానికి మించి మిర్చి వేశారు. మండలంలోని భట్టుపల్లి, కరకగూడెం, చిరుమళ్ళ, గొడుగుబండ, పద్మాపురం, అనంతారం, తుమ్మలగూడెం, బుర్థారం, కలవనాగరం, రేగళ్ల తదితర గ్రామాల్లో మిర్చిని విస్తారంగా సాగు చేశారు. అప్పు చేసి డ్రిప్ విధానాన్ని తెచ్చుకున్నారు. ఇలా భారీగా పెట్టుబడితో ఆశించిన ఫలితాలు వస్తాయని ఆశించారు. తీరా రైతులకు ఆది నుంచీ ఎదురుదెబ్బలే తగిలాయి.

దిగుబడులు తగ్గిన తీరిది..

మొదట నర్సరీలో మిరప మొక్కలు పెంచేందుకు ఒక మొక్కకు 1 రూపాయి చొప్పున వేలకు వేల రూపాయలు ఖర్చు చేశారు. కానీ దురదృష్టవశాత్తు నాటిన కొద్ది రోజులకే వైరస్ రావడంతో మొక్కలను పూర్తిగా తొలగించేందుకు దున్నేశారు. దీంతో మరోసారి మొక్కలు నాటేందుకు ఎకరానికి రూ.20 వేలు ఖర్చు చేసి మొక్కలు కొనుగోలు చేసి నాటారు. వాటిని దక్కించుకునేందుకు పురుగు మందులు, దుక్కి మందులు మొదటి నుంచే పట్టించారు. పరావాలేదు అనుకునే సమయానికి మరోమారు వైరస్ దాడి చేయనే చేసింది. సరిగ్గా పంట చేతికి వచ్చే సమయంలో చీడపీడలు ఆవరించాయి. వాతావరణ మార్పులతో మిరప కాయ ఏరే అవకాశం లేనంతగా వైరస్ ఆశించింది. పెరుగుదల లోపించి మిర్చి పసుపురంగులోకి మారింది. ఎన్ని మందులు కొట్టిన ఫలితం లేదు. దీనికితోడు చేతికొచ్చిన కొద్దోగొప్పో పంటను రైతులు మార్కెట్‌కు తీసుకెళ్తే సరైన ధర పలుకక నష్టాలకు అమ్ముకుంటున్నారు.

భారీ నష్టాల్లో రైతులు

ఎక్కువ ఎకరాల్లో మిర్చి వేసేందుకు రైతులు పెద్ద పెత్తంలో పెట్టుబడులు పెట్టారు. కొందరు డ్రిప్, ఇతర ఆధునిక పరికరాలు, పద్ధతుల కోసం మరింత ఖర్చు చేశారు. ఆ చొప్పున ఎకరాకు 90వేల నుంచి లక్ష వరకు పెట్టుబడిపెట్టారు. ఎక్కువ మంది సాధారణ రైతులే కావడంతో దున్నేదగ్గర నుంచి ప్రతీ ఖర్చును అప్పులు చేసి సమకూర్చుకున్నారు. కానీ చివరికి చీడపీడలు ఆశించడం, వాతావరణ మార్పులతో ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు రావాల్సిన దిగుబడి.. అందులో సగం కూడా రాలేదు. దీంతో రూ.లక్షల్లో పంటనష్టపోయారు. ఫలితంగా పెట్టుబడులు దగ్గకపోవడమే గాక కూలీలకు సైతం డబ్బులు చెల్లించలేని పరిస్థితి వచ్చిందని కర్షకులు కన్నీటిపర్యంతం అవుతున్నారు.

తెగుళ్లపై అవగాహన ఏది?

ఒక వైపు మిర్చి రైతులు పండాకు, నల్లి, తామెర తెగుళ్ల దాడితో సతమతం అవుతుంటే సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 13 వందల ఎకరాల్లో మిర్చి సాగు అవుతోంది. ఇంత మొత్తంలో మిర్చి పంటలు ఉన్నా రైతులకు అవగాహన కల్పించిన దాఖలాలు లేదు. కనీసం పంట క్షేత్రాలను సందర్శించి రైతులకు ధైర్యం చెప్పిన పరిస్థితి కూడా లేదు. మిర్చి పంటకు ఏ సమయాన ఏ మందు కొట్టాలి, పంటను ఏ విధంగా కాపాడుకోవాలి అనే సలహాలు అందింది లేదు. ఈ సమాచారం లేక రైతులు తర్జనభర్జన పట్టారు. దీంతో వ్యవసాయ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోత కోయాలంటే భయమేస్తోంది..



ఎంతో కష్టపడి మిరప సాగు చేస్తే పంట చేతికి వచ్చే అవకాశం లేకుండా పోయింది.లక్షల్లో పెట్టుబడి పెట్టాం. కోత కోయాలంటే భయమేస్తోంది. కూలి ధరలు బాగా పెరిగాయి. పంట అమ్మకం కంటే కూలి రేట్లు అధికం అనిపిస్తోంది. వైరస్ ఆశించడం వల్ల పంట మొత్తం పసుపు పచ్చ రంగులోకి మారి ఎండిపోయింది. ప్రభుత్వం ఆలోచించి సాయం చేయాలి.

– గోగు లీల, మహిళా రైతు, రేగుళ్ల

ప్రభుత్వం ఆదుకోవాలి



ఎంతో కష్టపడి మిరప సాగు చేస్తే పంట చేతికి వచ్చే అవకాశం లేకుండా పోయింది. రాత్రనక, పగలనక కష్ట పడి మిరప సాగు చేస్తే వైరస్ ఆశించి పంట మొత్తం పాడైపోయింది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. మిర్చి ధరలు అస్థిరంగా ఉండటం వల్ల రైతులు తమ పంటకు తగిన ధర లభించక ఇబ్బందులు పడుతున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– ముద్దం సతీష్, రైతు, భట్టుపల్లి

భూసార పరీక్షలు చేసుకోవాలి



రైతులు భూసార పరీక్షలు చేసుకున్నాకే పంటలు వేయాలి. తరచూ పంట మార్పిడి చేస్తూ ముందుకు సాగాలి. ఆలస్యంగా నాటడం ద్వారా కూడా మిర్చిలో పలు రకాల తెగుళ్ల వచ్చే అవకాశం ఉంది. రైతులు ఆ పొరపాటు చేయకుండా చూసుకోవాలి. తెగుళ్లపై, వాటి నివారణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– ఛటర్జీ, ఏఓ, కరకగూడెం

బీజేపీ సన్నాహక సమావేశం



మణుగూరురూరల్: మాట్లాడుతున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

దమ్మపేట: మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ.రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తమ్ రెడ్డి గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలు, తదితర అంశాలపై తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ సోలస పుష్కర్, బీజేపీ నాయకులు గొట్టిపుళ్ల దుర్గాశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపునకు కృషి చేయాలి..

మణుగూరురూరల్: త్వరలో జరగబోయే ఖమ్మం-నల్లగొండ-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎన్నికల పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు జంపన సీతారామరాజు, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, పున్నం బిక్షపతి, కుంజా రామకృష్ణ, పట్వా బిక్షపతి, వెంకటేశ్వర్లు, చందర్‌రావు, రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈలో సత్తాచాటిన విద్యార్థులు

దమ్మపేట: స్థానిక గిరిజన గురుకుల ప్రతిభా కళాశాల విద్యార్థులు మంగళవారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న భూక్యా గీతూ కుమార్ 93.7 పర్సంటైల్‌తో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని గురుకులాల్లో టాపర్‌గా నిలిచాడు. భూక్యా మహేష్, 77 పర్సంటైల్ సాధించి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. ఈ విద్యార్థులకు ఎన్ఐటీ, ఐఐటీ కళాశాలల్లో ప్రవేశం పొందే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ సీతారాములు తెలిపారు.



భూక్యా గీతూకుమార్



భూక్యా మహేష్

అశ్వారావుపేటరూరల్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అశ్వారావుపేటలోని వీకేడీవీఎస్ రాజు జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ శేషుబాబు తెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థి కొచ్చర్ల భగత్ 91.6184 పర్సంటైల్‌తో అత్యుత్తమ ర్యాంక్ సాధించాడు. కళాశాల అధ్యాపకులు, తల్లిదండ్రులు విద్యార్థిని అభినందించారు.

'వృక్షార్చన' పోస్టర్ల ఆవిష్కరణ



దమ్మపేట: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు, నాయకులు

దమ్మపేట: మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఈనెల 17న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మూడు మొక్కలు నాటాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని తాటి సుబ్బన్నగూడెంలో బుధవారం ఆయన వృక్షార్చన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. వృక్షార్చన పేరిట చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావు జోగేశ్వరరావు, సోయం వీరభద్రం, దొడ్డా రమేశ్, గాజబోయిన ఏసుబాబు, తూత నాగమణి, ఉయ్యాల చిన్నవెంకటేశ్వర్లు, శ్రీరాముల చక్రధరరావు, పర్వతనేని ప్రభాకర్ రావు, సోడె గంగరాజు పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకల పోస్టర్లు..

ములకలపల్లి: ములకలపల్లిలోని ఉమా పృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి పర్వదిన వేడుకలకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నరాటి ప్రసాద్ తెలిపారు. వేడుకలకు సంబంధించి బుధవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 26న జరిగే శివ పార్వతుల కల్యాణ వేడుకకు భారీగా భక్తులు హాజరు కావాలని కోరారు. ఆలయ అర్చకుడు విస్సావజ్జుల సురేశ్ శర్మ, కమిటీ సభ్యులు బండి కొమరయ్య, శనగపాటి సీతారాములు, కొదుమూరి వీరగోపాల్, బిక్కుమళ్ల వేణు, పువ్వాల లలితారావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

మణుగూరుటౌన్: పట్టణంలోని రాజుపేట మెయిన్ రోడ్డులో పాత పైప్‌లైన్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేస్తున్న సందర్భంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు సింగరేణి సివిల్ డిపార్ట్‌మెంట్ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పీవీకాలనీ, బంగ్లాస్ ఏరియా, అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లు, రైల్వే స్టేషన్ నివసించే కార్మిక కుటుంబాలకు, రైల్వే విభాగాలకు 13వ తేదీ మధ్యాహ్నం నుంచి 15వ తేదీ సాయంత్రం వరకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. కార్మిక కుటుంబాలు, సమీప ప్రజలు గమనించాలని సూచించారు.

17న సీపీఐ సభ

మణుగూరుటౌన్: ఈ నెల 17న చిక్కుడుగుంటలో జరిగే సీపీఐ భారీ సభను జయప్రదం చేయాలని, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య పిలుపునిచ్చారు. బుధవారం చిక్కుడుగుంటలో గ్రామంలో గడ్డం మనోహరచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు అయిన సందర్భంగా పార్టీ కోసం పనిచేసి అమరుల కోసం స్మారక పైలాన్ ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశానికి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పుల్లారెడ్డి, పత్తిపాటి నాగేశ్వరరావు, కామిశెట్టి రామారావు, మేడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

20న ప్రజాప్రదర్శన

చండ్రుగొండ: ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న హైదరాబాద్‌లో ప్రజాప్రదర్శన నిర్వహించనున్నట్లు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు ఎస్‌కె.ఉమర్ తెలిపారు. ఈ మేరకు గ్రామంలో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రజాప్రదర్శనను జయప్రదం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో నాయకులు వరికూటి వెంకట్రావ్, బి.భీముడు, ఆర్.రమేష్, గంగరాజు, చెన్నారావు, కామేష్, మహేష్, వెంకన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

చండ్రుగొండ: దమ్మపేటలోని క్యాంప్ కార్యాలయంలో మైనారిటీ నాయకులు ఎమ్మెల్యే జారే ఆదినారాయణను బుధవారం కలిశారు. చండ్రుగొండలోని మజీద్‌ల అభివృద్ధితోపాటు ఖబరస్తాన్‌కు ప్రహరీ నిర్మాణం, షాదీఖానా మంజూరి తదితర సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఖాజీ ఎండి.షబ్బీర్‌హుసేన్, ఎండి.ఇమామ్‌సాబ్, మౌలాలీ, నాగుల్‌మీరా, ఎండి.అన్వర్, ఇమ్రాన్, సఫ్దర్, వసీం, రబ్బానీ, ముర్తుజా పాల్గొన్నారు.

ఎన్నికల్లో సత్తా చాటాలి

దమ్మపేట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేలా సమష్టిగా పనిచేయాలని, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బుధవారం మండలంలోని గండుగులపల్లి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ.. ఇటీవల నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థలు, ఎంపీటీసీల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దిశెట్టి సత్యప్రసాద్, కోటగిరి సత్యంబాబు, కక్కిరాల రమేష్, పర్వతనేని ప్రసాద్, చిన్నశెట్టి యుగంధర్, కొయ్యల అచ్యుతరావు, వాసం శ్రీను, ఏసుమణి, మన్నెం అప్పారావు, మడకం రాజేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అభ్యసనతో ప్రతిభకు పునాది

అశ్వారావుపేటరూరల్: అభ్యసనతోనే ప్రతిభకు పునాది పడుతుందని, విద్యార్థులు నిరంతరం అభ్యసనం చేయాలని అశ్వారావుపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం పరుచూరి హరిత అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో జరిగిన కాంప్లెక్స్ స్థాయి బాలమేళా కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ముందుగా తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులలో కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులతో ఎఫ్ఎల్ఎన్ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆమె బహుమతులు, సర్టిఫికెట్‌లను అందజేశారు. కాంప్లెక్స్ స్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపికైన నందమూరినగర్ పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జున్‌రావు, కర్మిషా తబుస్సుంలను ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధు, సీఆర్‌పీ ప్రభాకరచార్యులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి, సర్టిఫికెట్‌ను అందిస్తున్న హెచ్‌ఎం హరిత

ముగిసిన బ్రహ్మోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు, భక్తులు

భద్రాచలంటౌన్: భద్రాద్రి హరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శబరిమల విధానంలో ఆలయ నంబూద్రి అరుణ్ రామచంద్రన్ నేతృత్వంలో బుధవారంతో ముగిశాయి. చివరిరోజు పండితుల సారథ్యంలో పలు హోమాలు, అభిషేకాలు నిర్వహించగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తుమ్మల రాంమోహన్ రావు–వసుంధర దంపతులు బెంగుళూరు వారి సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకుడు బాదంపూడి సంతోష్ శర్మ, ఆలయ అధ్యక్షుడు అదుసుమిల్లి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పుల్లారావు

ములకలపల్లి: నేటి యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని తహసీల్దార్ గుడ్ల పుల్లారావు సూచించారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, రామచంద్రా మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శిశుమందిర్ ఆవరణలో ఏర్పాటు చేసిన ధ్యానోత్సవ కార్యక్రమాన్ని బుధవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఏజెన్సీ మండలమైన ములకలపల్లిలో మూడు రోజులపాటు ధ్యాన్య శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విశ్రాంత ఉద్యోగి రమణ గురూజీ ధ్యాన తరగతులు బోధించారు. హైస్కూల్ హెచ్‌ఎం లత, గిర్దావార్–2 భద్రు, మాజీ ఎంపీటీసీ శనగపాటి మెహరమణి, మేకల పెద్ద వెంకన్న, సీతారాములు, పద్దం బుజ్జి, గాడి తిరుపతిరెడ్డి, గుప్త, పద్మ, గొల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లో ఉన్న శ్రీవిద్యాభ్యాస(బాలవెలుగు)కు భరోసా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నగదు వితరణ చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏకలవ్య వంటి పోటీపరీక్షల ఫీజుల నిమిత్తం రూ.5వేల చెక్కును మణుగూరు సింగరేణి అదనపు మేనేజర్ వి.అప్పారావు చేతుల మీదుగా పాఠశాల నిర్వాహకుడు బి.జగన్మోహన్‌రెడ్డికి అందజేశారు. తొలుత వి.సాయికార్తీక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ రాంబాబు, రక్షణ అధికారి, భరోసా వెల్ఫేర్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు లింగబాబు, సుధాకర్, అధ్యక్షుడు అమీనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి వితరణ

మణుగూరురూరల్: మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీ సీటైప్ ప్రాంతంలో ఇన్ఫెక్షన్ కారణంగా కాలును కోల్పోయిన తాటి బాబురావుకు పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం 25కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ముజ్జు, ఉపాధ్యక్షులు సాయి, అమూల్ శ్రీను, మధు(ఆర్ఎంపీ), కొమరం రాజు, చెలికాని రామకృష్ణ, బడే రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దయాకర్‌రావుకు డాక్టరేట్



దయాకర్‌రావును సత్కరిస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

చండ్రుగొండ: మండలంలోని దామరచర్లకు చెందిన కొదుమూరి దయాకర్‌రావుకు ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్, ఇందిరా ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యాన గౌరవ డాక్టరేట్ ప్రకటించారు. రెండు దశాబ్దాలుగా చేస్తున్న సామాజిక సేవలు చేస్తున్న ఆయనకు.. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన సమావేశంలో డాక్టరేట్ అందజేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్న దయాకర్‌రావును కాంగ్రెస్ నాయకులు, ఆర్యవైశ్య సంఘాల బాధ్యులు అభినందించారు.

ప్రారంభమైన జాతరలు

మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో మినీమేడారం జాతరలు ప్రారంభమయ్యారు. మణుగూరు మండలంలోని తోగ్గూడెంలో బుధవారం జాతర కొలాహలం మొదలైంది. చర్ల మండలంలోని ఎదిరగుట్టలోని జాతర సందర్భంగా సారలమ్మ గద్దెకు చేరింది. కరకగూడెం మండలంలోని చిరుమళ్ల గ్రామంలో జాతరలో పగిడిద్దరాజు కొలువుదీరాడు. అశ్వారావుపేట మండల పరిధిలోని నారాయణపురం గ్రామశివారులో కట్టమైసమ్మ తల్లి జాతర, ఇదే మండలంలోని నారంవారిగూడెం కాలనీ గ్రామంలో విజయదుర్గ భవాని జాతరలు ఆరంభ శంఖం పూరించాయి.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: వనదేవతలను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పాయం



చర్ల: సారలమ్మ వారిని సోములదేవమ్మ గట్టుల్లో నుంచి తోడుకొని వస్తున్న గిరిజనులు



పూనకంతో ఊగుతున్న పూజారి, పూజలు చేస్తున్న మహిళలు